క్లుప్తంగా

వేసవి సెలవుల్లో జాగ్రత్తలు పాటించాలి



మాగనూర్: వేసవి సెలవుల్లో విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలని పెగడబండ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం నరేందర్ తెలిపారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రగతి నివేదికలు, వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అమ్మ ఆదర్శపాఠశాల కమిటీ పనులలో పురోగతులు, సెలవులలో విద్యార్థుల అభ్యసన కొనసాగింపు అనే అంశాలపై ఎజెండాను తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యావలంటరీ మహాదేవ్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో టార్పాలిన్లు

మరికల్: కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తడవకుండా ఉండేందుకు పేట మార్కెట్‌శాఖ నుంచి టార్పాలిన్లు అందుబాటులో ఉంచామని మార్కెట్ కమిటీ డీఎంఓ బాలమణి, కార్యదర్శి భారతి మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. జిల్లాకు 520టార్పాలిన్లు వచ్చాయని, కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చిన రైతులకు అందజేస్తున్నట్లు తెలిపారు. అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో ప్రారంభించిన ప్రతి కొనుగోలు కేంద్రానికి టార్పాలిన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని సూచించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఊట్కూరు: మండలంలోని తిప్రాస్‌పల్లి మాజీ సర్పంచ్ సక్కీరప్ప (68) మంగళవారం తెల్లవారుజామున మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కుటుంబ సభ్యులను పరామర్శించి మృతదేహానికి నివాళులర్పించారు. సింగిల్‌విండో అధ్యక్షుడు బాల్‌రెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠాపన

మక్తల్: మండలంలోని కర్నెలో మంగళవారం శ్రీ ఎల్లమ్మ దేవత విగ్రహాన్ని ఘనంగా ప్రతిష్ఠించారు. ఈ మేరకు.. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, బీకేఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి, నాయకులు గోపాల్‌రెడ్డి, గణేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవ పూజలు



మరికల్: మండల కేంద్రంలోని మాత మాణికేశ్వరీ ఆలయ 14వ వార్షికోత్సవ పూజలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు.. అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదంతో పాటు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు బహూకరణ

నారాయణపేట రూరల్: ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జాజాపూర్ గ్రాంథాలయానికి పలు రకాల పుస్తకాలను బహూకరించారు. లేబర్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహించి పదవీవిరమణ పొందిన పద్మజా ప్రదీప్ తన సొంత డబ్బులతో 250పుస్తకాలు, వాటిని భద్రపర్చడానికి ఒక అల్మారాను అందించారు. ఈ మేరకు.. సర్వోదయ గ్రంథాలయ నిర్వాహకులు డాక్టర్ ఆచార్య ఆవుటి జగదీష్ మాట్లాడుతూ.. యువత సమయం వృథా చేసుకోకుండా పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించుకోవాలని, వేసవి సెలవుల్లో విద్యార్థులు సైతం గ్రంథాలయానికి రావాలని కోరారు.

బీజేపీలో చేరిక..

కృష్ణా: మండలంలోని కున్సిలో రెండురోజుల క్రితం బీజేపీకి చెందిన గ్రామ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన వారు మంగళవారం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సోమశేఖర్‌గౌడ్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మజ్జిగ సురేష్ ఆధ్వర్యంలో తిరిగి సొంత గూటికి చేరుకున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. చేరిన వారిలో సాబ్‌గౌడ్, జనార్దన్‌గౌడ్, నర్సాగౌడ్, జగదీష్, సాయిబన్న, మల్లప్ప తదితరులు ఉన్నారు.



నెమ్మదిగా సా..గుతున్న పనులు

- ఇంకా పూర్తికాని మినీ ట్యాంక్ బండ్ నిర్మాణపనులు
- బిల్లుల జాప్యంతో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం
- త్వరగా అందుబాటులోకి తేవాలని స్థానికుల విజ్ఞప్తి



బతుకమ్మ ఘాట్



ట్యాంక్‌బండ్ ఆనకట్టపై చేసిన రేయిలింగ్ పనులు (ఫైల్)

మరికల్: 'హైదరాబాద్ ట్యాంక్‌బండ్ తరహాలో పర్యాటకులను ఆకట్టుకునేందుకు జిల్లాలోని ప్రతి నియోజకవర్గానికి ఒక మినీ ట్యాంకుబండ్‌ను మంజూరు చేసింది గత ప్రభుత్వం. కానీ, లక్ష్యం చేరుకోకపోవడంతో పర్యాటకుల కల నెరవేరడం లేదు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు మొదటి నుంచి బిల్లుల జాప్యం కారణంగా ఇన్నాళ్లు పనులు సా..గుతూనే ఉన్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో మినీ ట్యాంకుబండ్‌ల విషయం చర్చకు రాలేదు. దీంతో చేయాల్సిన పనులకు బిల్లులు లేక ఆగిపోయాయి.

2016లో టెండర్లు..

నారాయణపేట నియోజకవర్గంలో జాతీయ రహదారిపై ఉన్న మరికల్ పెద్ద చెరువును మినీ ట్యాంక్‌బండ్ కోసం ఎంపిక చేసి, 2016లో టెండర్లను ఆహ్వానించి ట్యాంకుబండ్ నిర్మాణానికి రూ.3.46 కోట్లు కేటాయించి, కాంట్రాక్టర్లతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఎన్నో బాలరిష్టాల మధ్యన మినీ ట్యాంక్‌బండ్ పనులు ప్రారంభం చేశారు. అయితే చేయాల్సిన పనుల్లో ఆనకట్టపై కుర్చీలు, లైటింగ్ విధానం పనులు

పర్యాటకులకు మినీ ట్యాంక్‌బండ్‌లో చక్కర్లు కొట్టేందుకు బోటింగ్ విధానం పనులు చేయాల్సింది. కానీ, బిల్లుల మంజూరు కాకపోవడంతో ఈ పనులు ముందుకుసాగడం లేదు.

బిల్లులు రాకనే ఆలస్యం..

పర్యాటకుల కల నేరవేరడం కోసం మరికల్‌లో 2016లో ప్రారంభించిన ట్యాంకుబండ్ నిర్మాణ పనులకు అప్పటి ప్రభుత్వం నుంచి సకాలంలో బిల్లులు మంజూరు చేయకపోవడంతో ఎనిమిదేళ్లపాటు నత్తనడకన పనులు సాగుతున్నాయి. ఏడాదిలో పూర్తి చేయాల్సిన పనులు ఇన్నాళ్లు కొనసాగడంతో పర్యాటకుల కల కలగానే మిగిలిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం మినీట్యాంక్‌బండ్‌కు రావాల్సిన పెండింగ్ బిల్లులను మంజూరు చేస్తే పనులు పూర్తిచేసే అవకాశం ఉందని గ్రామస్తులు కోరుతున్నారు.

చేసిన పనులు..

- చెరువు ఆనకట్ట 6.25 మీటర్ల వెడల్పు
- తూములు, అలుగులు, పాటుకాల్వల మరమ్మతు
- ఆనకట్ట రిలింగ్, రివెంట్‌మెంట్
- కట్టపై సీసీరోడ్డు నిర్మాణం
- కట్ట పైకి వెళ్లడానికి ర్యాంపు
- మినీ ట్యాంకుబండ్ చుట్టూ రెండు మీటర్ల వెడల్పుతో వాకింగ్ ట్రాక్
- బతుకమ్మ ఘాట్ నిర్మాణాలు పూర్తయ్యాయి.

90 శాతం పూర్తి చేశాం..

మరికల్ మినీట్యాంకుబండ్ పనులు ఇప్పటి వరకు 90శాతం పూర్తిచేశాం. పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరు కాకపోవడంతో చేయాల్సిన పదిశాతం పనులు మిగిలిపోయింది. ఈ విషయాన్ని కొత్త ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పెండింగ్ బిల్లులు మంజూరు చేయించి మిగిలిన పనులు పూర్తిచేయిస్తాం.

- కిరణ్‌కుమార్, డీఈఈ

వైభవంగా లక్ష్మీవేంకటేశ్వరస్వామి ప్రభోత్సవం



శోభయాత్రలో పాల్గొన్న భక్తులు

కృష్ణా: మండల పరిధిలోని గుడెబల్లూర్‌లో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం తెల్లవారుజామున స్వామివారి ప్రభోత్సవాన్ని అంగరంగ వైభవంగా వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు, అలంకరణ, అభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రజలు, భక్తుల ఆధ్వర్యంలో జ్యోతుల కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం ఉద్దాలను గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. ఉత్సవాలకొచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గ్రామస్తులు అన్ని సౌకర్యాలు కల్పించారు.

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం



ధన్వాడ: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మరోసారి నరేంద్ర మోదీ ప్రభుత్వం బలపర్చాలని, ఎంపీ అభ్యర్థి అరుణమ్మను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీజేపీ జిల్లా మీడియాసెల్ కో -కన్వీనర్ సుంకు ఉమేష్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని అప్పజినగర్‌లో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, లంకల గోపీ, రవి తదితరులు పాల్గొన్నారు.

గురుకులాలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



విద్యార్థులతో ఉపాధ్యాయులు

నర్వ: మండలంలోని నాగిరెడ్డిపల్లికి చెందిన ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఐదుగురు గురుకులాలకు ఎంపికైనట్లు హెచ్ఎం రాజు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులను అభినందించారు. హెచ్ఎం రాజు, ఉపాధ్యాయులు పద్మ తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: మండలంలోని మండల ప్రాథమిక పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు గురుకులాలకు ఎంపికైనట్లు హెచ్ఎం స్వప్న తెలిపారు. ఈమేరకు.. మంగళవారం విద్యార్థులు తేజశ్విని, కృష్ణవేణిలతో పాటు తల్లిదండ్రులను పాఠశాల ఆవరణలో శాలువాతో సన్మానించారు. ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు మంచిగా చదువుకుని భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హెచ్ఎంకు వినతి అందజేత

మాగనూర్: మండలంలోని కొల్పూర్‌లో మండల ప్రాథమిక పాఠశాలలో నూతనంగా అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సహేరా బేగంను తమకు వద్దు అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు హెచ్ఎం దృష్టికి తీసుకువెళ్లి సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు తల్లిదండ్రులు మాట్లాడుతూ.. ఆదర్శ కమిటీ విషయంలో తమకు ఎలాంటి సమాచారం లేకుండానే నేరుగా ఉపాధ్యాయులు, అధికారులు కమిటీని ఎన్నుకున్నారని, వెంటనే ఆ కమిటీని రద్దుచేసి నూతన కమిటీని ఎన్నుకోవాలని తెలిపారు. గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

నారాయణపేట: జిల్లా కేంద్రంలో బుధవారం సాయంత్రం 4గంటల నుంచి 6గంటల వరకు 11 కేవీ ఫీడర్ మరమ్మతు పనులతో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ మహమ్మద్ రఫీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు అంతరాయానికి సహకరించాలని ఏఈ కోరారు.

వైభవంగా హనుమాన్ జయంతి



మరికల్‌లో శోభాయాత్రలో పాల్గొన్న యువకులు

నారాయణపేట రూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో హనుమాన్ జయంతి ఉత్సవాలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆయా గ్రామ ఆలయ కమిటీ సభ్యులు, యువతతో కలిసి పురవీధుల గుండా కాశాయజెండాలతో ర్యాలీలు నిర్వహించి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే జాజాపూర్‌లో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జట్టి హనుమాన్ జాతర ఉత్సవాలు కొనసాగింది. ఉదయం ఆలయంలో స్వామివారికి పంచామృతాభిషేకం, వెండి ఆభరణాలతో అలంకరణ, హారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

దామరగిద్ద: మండలంలోని ఆయా గ్రామాల్లో హనుమాన్ జయంతిని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, పల్లకిసేవా, శోభయాత్ర, జల్దిబిందె ఉత్సవాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. అలాగే విఠలపూర్‌లో బండలాగుడు పోటీలను నిర్వహించారు.

ధన్వాడ: మండల పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం హనుమాన్ జయంతిని వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు.. యంనోనిపల్లి, కంచుకోటలో తదితర గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

మద్దూరు: మండలంలో పలు గ్రామాల్లో హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. అలాగే తిమ్మారెడ్డిపల్లిలో బావాజీ ఆలయంలో ఉన్న ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముష్టి నర్సింహులు, సర్పంచ్ అరుణ, వెంకట్‌రాముగౌడ్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నర్సింహులుగౌడ్, తిరుమలప్ప తదితరులు పాల్గొన్నారు.



ఎక్లాస్‌పూర్‌లో స్వామివారికి అభిషేక పూజ

మరికల్: ఆంజనేయస్వామి జయంత్సోవాల సందర్భంగా స్థానిక విశ్వహిందూ భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో మంగళవారం వైభవంగా హనుమాన్ శోభయాత్రను నిర్వహించారు.

కృష్ణా: మండలంలోని నూతన విగ్రహాలకు మంగళవారం మఠాధిపతులు ఆధ్వర్యంలో ప్రాణ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించారు. గుర్జాల్‌లో కడెచూర్ పీఠాధిపతి శ్రీ గురుమూర్తి శివాచార్య మహాస్వామి ప్రాణ ప్రతిష్ఠాపన నిర్వహించారు. అనంతరం ఆలయంలో గ్రామ మాజీ సర్పంచ్ దేవేంద్రప్ప, జెడ్పీటీసీ సభ్యురాలు అంజనమ్మ, కాంగ్రెస్ నాయకులు రవిగౌడ పూజలుచేసి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు అభిస్వామి, శరణయ్యస్వామి, కున్సిలో ప్రభు పూజారి, గ్రామ నాయకులు సోమశేఖర్‌గౌడ్, నర్సప్ప, సిద్దప్ప పాల్గొన్నారు.



కృష్ణాలో..



దామరగిద్దలో..



మద్దూర్‌లో..

శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే



మక్తల్: పట్టణంలో మంగళవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వైభవంగా శ్రీ హనుమాన్ శోభయాత్రను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరై శోభయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మానికి, శక్తికి, ఐక్యతకు ప్రతిరూపం ఆంజనేయుడని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికచింతన పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు కొండయ్య, లక్ష్మారెడ్డి, రాజుల ఆశిరెడ్డి, భీంరెడ్డి, కర్ణిస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి



కూలీలతో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ రాజేశ్వరి



లక్ష్మీపూర్‌లో మాట్లాడుతున్న వెంకట్రాములు

మాగనూర్: మండలంలోని ఉపాధిహామీ కూలీల సంఖ్య పెంచాలని డీఆర్‌డీఓ రాజేశ్వరి అన్నారు. మంగళవారం ఆమె మండలంలోని అడవిసత్యారం, పెగడబండ గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి పనులను ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఉపాధికూలీలకు ప్రతి పనిలో మస్టర్ తప్పనిసరిగా ఉండి గ్రూపులలో పొందుపర్చాలని తెలిపారు. గ్రామంలో వందరోజుల పనులకు రోజు వారి కూలీ రూ.300 ఉంటుందని తెలిపారు. సరైన కొలతలతో కూలీ అందజేయాలని తెలిపారు. ఎండలు అధికంగా ఉండడంతో వారికి నీడను ఏర్పాటు చేసి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, నీరును ఏర్పాటుచేయాలని సూచించారు. అదేవిధంగా అడవిసత్యారం పంచాయతీ పరిధిలో కూలీల సంఖ్య తక్కువగా ఉందని కూలీల సంఖ్య పెంచాలని ఇన్‌చార్జి ఏపీఓ హర్షవర్ధన్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏపీఓ హర్షవర్ధన్, ఫీల్డ్ అసిస్టెంట్ నవకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

నారాయణపేట రూరల్: ఉపాధిహామీలో పనిచేస్తున్న కూలీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు వెంకట్రాములు డిమాండ్ చేశారు. మండలంలోని లక్ష్మీపూర్, చిన్నజట్రం గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. ఉపాధి పనులు కొనసాగుతున్న ప్రాంతాలకు వెళ్లి కూలీలతో మాట్లాడారు. జాబ్‌కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికి 200రోజులు పని కల్పించాలని, రోజువారి కూలీని రూ.600కి పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నర్సింహులు, ఎల్లమ్మ, రమేష్, భీంరెడ్డి, చెన్నమ్మ పాల్గొన్నారు.

బడి బయటి పిల్లలకు హాల్‌టికెట్లు



విద్యార్థులకు హాల్‌టికెట్లు అందిస్తున్న కలెక్టర్

నారాయణపేట రూరల్: బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ వారు బడిబయటి బాలికలను గుర్తించి వారిని టాస్ ద్వారా ఓపెన్ స్కూల్ ద్వారా చదువు చెప్పించారు. ఈ క్రమంలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలో 285మంది కిషోర బాలికలకు పరీక్షలకు దరఖాస్తు చేయించగా వారికి మంగళవారం కలెక్టర్ శ్రీహర్ష చేతులమీదుగా హాల్‌టికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఏ ఒక్కరు చదువుకు దూరంగా ఉండరాదని, భవిష్యత్‌లో వందశాతం అక్షరాస్యత కల్గిన జిల్లాగా మార్చుచెందాలన్నారు. రెగ్యులర్‌గా విద్యాసంస్థలకు వెళ్లి చదువుకోలేని వారికి ఓపెన్ స్కూల్ స్టడీ ఎంతో ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి నర్సింహారావు, సీడీపీఓ శ్రీలత, సమన్వయకర్త నర్సింహులు, సిబ్బంది అనిత, విజయ్, నర్సింహ, స్వప్న, నరేష్ పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

మరికల్: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి గెలుపు కోసం మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం హనుమాన్‌వాడ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రచార పత్రాలను పెట్టి పూజలు చేశారు. ఈ మేరకు.. ఓబీసీ జిల్లా చైర్మన్ కృష్ణయ్య మాట్లాడుతూ.. వంశీచంద్‌రెడ్డి విజయం కోసం ప్రతి కాంగ్రెస్ కార్యకర్తపట్టుదలతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సూర్యమోహన్, వీరన్న, హరీష్, రామకృష్ణ, మొగులప్ప, రామకృష్ణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



ప్రచార పత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

విద్యార్థినులకు సన్మానం

అమరచింత: మండల కేంద్రంలోని జెడ్పీఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతూ సీఓఈ పరీక్షలో ప్రతిభ చూపి సీటు సాధించిన విద్యార్థినులకు మంగళవారం పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు సన్మానించారు. పాఠశాలకు చెందిన తస్లీమా ఎంపీసీలో, హారిక ఈఎంలో సీటు సాధించినట్లు ప్రధానోపధ్యాయుడు బలరాముడు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాజ్‌కుమార్, ఉపద్యాయులు స్వామి, రాజేష్, దేవేంద్రం, విజయప్రకాష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



విద్యార్థినులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మోడల్ పరీక్ష విజయవంతం చేయండి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించే ఈఏపీసెట్, నీట్ మోడల్ పరీక్షను విజయవంతం చేయాలని నాయకులు పేర్కొన్నారు. ఈమేరకు పరీక్షకు పోస్టర్‌ను నాయకులు మంగళవారం విడుదల చేశారు. మరింత సమాచారం కోసం సంప్రదించాలన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



ఉత్సావాల్లో పాల్గొన్న ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి

కోయిల్‌కొండ: రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి కృషిచేస్తోందని ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి అన్నారు. మంగళవారం వీరభద్రస్వామి ఉత్సావాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వై.విద్యాసాగర్‌గౌడ్, మండల అధ్యక్షుడు జి.రవీందర్ పాల్గొన్నారు.

మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలి

నవాబుపేట: మన్నె శ్రీనివాస్‌రెడ్డిని ఎంపీగా రెండోసారి గెలిపించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహులు, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎంపీ నివాసంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. స్థానికుడిని గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలో జరిగే కేసీఆర్ రోడ్‌షో విజయవంతం చేయాలని కోరారు. మార్కెట్ మాజీ చైర్మన్ లక్ష్మయ్య, ఎంపీపీ అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ విడుదల

హన్వాడ: పులే, అంబేడ్కర్ జాతరను జయప్రదం చేయాలని దండోర నాయకులు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈనెల 28న జిల్లాకేంద్రంలో నిర్వహించే జాతరకు బహుజనులు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు.

10శాతం ఇంక్రిమెంట్ సరికాదు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూ అధ్యాపకుడు ప్రభాకర్‌రెడ్డికి ఏకంగా 10శాతం ఇంక్రిమెంట్ ఇవ్వడం సరికాదని పలు సంఘాల ఆధ్వర్యంలో పీయూ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డికి నాయకులు వినతిపత్రం అందజేశారు. పలు అంశాలను ఆయనకు వివరించారు. విద్యార్థి నాయకులు రవీందర్, ఛత్రపతినాయక్, లాలూప్రసాద్‌పాల్గొన్నారు.

ప్రజాపాలనను విస్మరించారు

మహబూబ్‌నగర్ రూరల్: ప్రజా పాలనను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని బీజేపీ పార్లమెంట్ ప్రచార కార్యదర్శి కె.సతీష్‌కుమార్ అన్నారు. మంగళవారం గాజులపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండల ఉపాధ్యక్షుడు ఎం.మునయ్య, నాయకులు పాల్గొన్నారు.